# ప్రతిఫలం

ఫుకడ్‌గా వచ్చిందని వెన్నెల్ని పీకలదాకా త్రాగి చంద్రుడు మబ్బుల మాటున మత్తుగా పడివున్నాడు.

రెండో ఆట సినిమాలు కూడా వదిలిపెట్టారు. ఊరూ-వాడా సద్దు మణిగింది. జన సంచారం సన్నగిల్లింది. రోడ్లు బావురుమంటున్నాయి. వీధి దీపాలు తమ 'విద్యుత్' ధర్మాన్ని నెరవేరుస్తోన్నాయి.

దీపక్‌మహల్ ప్రక్కనున్న బార్‌లోంచి బయటికి వచ్చిన కనకరాజు మాంచి 'లెవెల్'లో వున్నాడు. మహా వుషారుగా వున్నాడు. స్వర్గానికి బెత్తెడు దూరంలో వున్నాడు. అందమైన అమ్మాయి వంటరిగా కనిపిస్తే 'రేప్' చేసేటంత 'కసికసి'గా వున్నాడు. అతడ్ని చూచి బార్ వాచ్‌మెన్ ఠంచన్‌గా నిలబడి మిలటరీ సెల్యూట్ చేశాడు. ఆ ముసలి వాచ్‌మెన్ వినయానికి ముగ్ధుడై జేబులోంచి రూపాయి నోటు తీసి "తీస్కో పో మ్మన్నట్లు దిలాసాగా యిచ్చేశాడు.

తనకాపూట మందుపార్టీ యిచ్చిన 'పార్టీ'కి 'గుడ్‌నైట్' చెప్పి, బార్ ముందు పార్కుచేసిన తన స్కూటరును స్టార్టు చేశాడు.

ఆ పార్టీ 'జాగ్రత్త సార్!' అని చెప్పబోతుంటే -

"ఐ యాం ఆల్‌రైట్ ఐ సే! డోంట్ వర్రీ" అంటూ గాల్లోకి చెయ్యి వూసేసి బర్కత్‌పురా వయిపు సాగిపోయాడు....

అలా స్కూటర్ మీద పోతున్న అతని ఆలోచనలు ఇలా సాగుతున్నాయి......

ఈ పార్టీ వెధవ తనకు బోడి జాగ్రత్తలు చెప్తుతున్నాడు. తన సంగతి ఈ వెధవకు తెలియదు. ఇలా ఎన్ని సార్లో, ఎన్ని బారుల్లో, ఎంత మంది 'పార్టీ'లు దగ్గరో మందు పార్టీలుచ్చుకొని, ఈ స్కూటర్ మీదే, ఈ రోడ్లు మీదే ఎన్నో రాత్రుళ్ళు యింటికెళ్ళి, తలుపు తట్టి, బట్టలు మార్చుకొని, భార్యతో సరసమాడి, ఎంచక్కా 'సంసారం' చేసి కమ్మగా నిద్రపోయాడని. ఈ సన్నాసికి తెలియదు పాపం! వెధవ, వీడికి తెలిసిందల్లా సంసారుల వాడకట్టులో 'అమ్మాయిల కంపెనీ' పెట్టినట్లు రెసిడెన్సీ లొకాల్టీలో మందుల ఫ్యాక్టరీ పెట్టడం - మున్సిపాల్టీ వారు అబ్జక్షన్ పెట్టితే నోట్ల కట్టలుచ్చుకొని హైదరాబాద్‌కు పరుగెత్తుకొని రావడం తన లాంటి 'యూడీసీ'ల దగ్గర్నుంచి టాప్ రేంక్ వరకూ 'పైరవీ' చేసి పైళ్ళు ఫేవర్‌బుల్‌గా మూవ్ చేయించుకొని పనులు చేయించుకోవటం - అంతేగాని ఎదుటోడు ఏ లెవెల్ వరకు మందు బింగించగలడు, వాడి కెపాసిటీ ఏంటి, వాడి 'లెవెల్' ఏంటి, వాడి బిగింపు ఏంటి అన్న ఆలోచనే

లేదు; అక్కడికి తనేదో రోడ్డుమీద తూలి పడిపోతున్నట్లు వెధవ, "జాగ్రత్తసార్" అని అంటున్నాడు....

అలా అతని స్కూటరూ, ఇలా అతని ఆలోచనలూ సాగిపోతూండగా ఇంతలో లింగంపల్లి ట్రాఫిక్ హైలాండ్ వచ్చింది. ఇవ్వాళ ఇటువయిపు షార్ట్‌కట్ కొట్టుదాంలే అనుకున్నాడు స్కూటర్‌ను ఎడంవయిపుకు త్రిప్పి, చింత తోట కెదురుగా వున్న బ్రిడ్జీ మీదుగా ఫీవర్ హాస్పటల్ (జ్వర చికిత్సాలయము) వెనుక గేటు వయిపు సాగిపోతున్నాడు....

లంబాడీల గుడిశలూ, పోచమ్మ గుడీ కూడా దాటాడు. ఆసుపత్రి వెనుకగేటు దగ్గరకొచ్చేసరికి కనకరాజుకు ఒక కుర్రాడు రెండు చేతుల్లో సీసాలు పట్టుకొని రోడ్డుకడ్డంగా పరుగెత్తుతున్నట్లు లీలగా కనిపించింది. అతనికి ఆ కుర్రవెధవ మీద కోపం కస్సున ముంచుకొచ్చింది.

"ఒరేధవా! నా స్కూటరుకే అడ్డం వస్తావురా! చూడ్రా నిన్నేం చేస్తానో!" కోపంతో కుత కుతలాడుతూ, పళ్లు పటపటలాడిస్తూ స్కూటర్ను ఆ కుర్రాడిమీదకక్కేట్లు ప్రక్కకు కోశాడు - అంతే స్కూటరు కీచుమని శబ్దంచేస్తూ మూడు గిరికీలు కొట్టి అతడ్ని కూడా తనతోపాటు మూడు గింగిరాలు త్రిప్పి ప్రక్కకు విసిరేసింది. ఆ విసురుకు అతడెళ్లి ఆసుపత్రి గేటు ప్రక్కనున్న వేపచెట్టు మొదట్లో పడ్డాడు; 'అమ్మా' అని ఆర్తనాదం చేశాడు..... ఇదంతా ఒక్క క్షణంలో జరిగిపోయింది!

స్కూటరు చేసిన భయంకరమైన కీచు శబ్దానికి వేపచెట్టు మీద కునుకుతున్న పక్షులన్నీ భయంగా రెక్కలు టపటపలాడించాయి. ఆసుపత్రి గేటుకెదురుగా రోడ్డుకటు వయిపువున్న గోరీలలో నిద్రపోతున్న ప్రేతాత్మలు 'అరి అల్లా!' అని ముక్కుమీద వేళ్ళేసుకున్నాయి. గేటు వారన వున్న బడ్డీకొట్టు అరుగుకు ఆనుకొని "కోడి నిద్ర" పోతున్న ఒక ఆకారం వులిక్కిపడి లేచింది.

అప్పుడు దిగంతాలనుంచి క్రిందకు జాలువారుతున్న వెన్నెల కనకరాజును కూడా కన్నతల్లిలాగా తన చల్లని చేతులతో తాకుతోంది; చల్లగాలి అతడ్ని కూడా మెల్లమెల్లగా స్పృశిస్తోంది. పాపం, వెన్నెలకి, చల్లగాలికి సన్మార్గులూ, - దుర్మార్గులూ, పుణ్యాత్ములూ-పాపాత్ములూ, పైవాళ్ళూ-అడుగువాళ్ళూ అనే బేధబుద్ధి లేదు మరి!

మళ్ళీ అంతలోకే నిశ్శబ్దం ఆవరించుకుంది..... చెట్టు క్రింద పడ్డ కనకరాజు మెల్లగా కదిలాడు. చిన్నగా మూల్గాడు. చిరుచిరులాడుతూన్న నుదురును చేత్తో తడుముకున్నాడు. వేడిగా, ఎర్రడాలుగా రక్తం చేతికంటింది. ఎప్పుడూ లేనిది ఇలా అయిందేమిటబ్బా అనుకున్నాడు. ఫుకడ్‌గా వచ్చిందని నిజంగానే మందు ఎక్కువ బింగిచానా ఏంవిటి అనుకున్నాడు.

తల దిమ్ముగా వుంది.

కొన్ని క్షణాల తర్వాత ఎలాగో వోపిక తెచ్చుకొని మెల్లగా పైకి లేవటానికి ప్రయత్నిస్తూ నేలమీద చెయ్యి మోపు చేశాడు.

అంతే! "అమ్మా" అంటూ ఆర్తనాదం చేశాడు. అతని ఆర్తనాదానికి కారణం అతని ప్రక్కనే వున్న సీసా పెంకుల్లో కోసుగా కొనదేరిన ఒక వాడి పెంకు! అది అతని కుడి అరచేతిలోకి కసిగా దిగబడింది. వేడిరక్తం పిచికారి చిమ్మినట్లు పైకి చిమ్మింది. చేతి కండలలోకి సగం దిగబడి గాజుపెంకు లోపల్లోపల

కుళ్లగిస్తోంటే, మిగతా సగం పెంకూ సంతోషం పట్టలేక ముసిముసిగా నవ్వుతుందా అన్నట్లు దాని మీద వెన్నెల పడి తళ తళ లాడుతుంది.

కనకరాజు గిలగిల్లాడిపోతూ బాధ భరించలేక గట్టిగా మూలగసాగాడు. అతని మూలుగు శబ్దానికి బడ్డీకొట్టు దగ్గర మునగ దీసుకొని కూర్చున్న ఆకారం మళ్ళీ వులిక్కిపడి లేచింది. మెల్లగా లేచి అతను పడివున్న చోటకు వచ్చింది. అతని మీదకు వంగి చూస్తూ "వోరు బాబూ? ఏటయింది బాబూ!" అని అడిగింది.

అతడు నోటితో చెప్పలేక బాధగా చెయ్యెత్తి చూపించాడు.

ఆ ఆకారం ఒక ఆడమనిషిది. ఆమె, గాజు పెంకు దిగబడ్డ అతని చేతిని చూచి, "అయ్యో ఎట్టా దిగడ్డది బాబు! అమ్మో అమ్మో ఎంత రగతం, ఎంత రగతం!" అంటూ బెంబేలు పడిపోయింది. గుండెల మీద కొట్టుకుంది. గిజగిజలాడి పోయింది. ఏం చేయటానికి పాలుబోక, కాలూ చెయ్యీ ఆడక పాపం తెగ కంగారుపడిపోయింది.

ఆసుపత్రి గేటు వయిపుకు పరుగెత్తింది. దాన్ని కదిలించి చూచింది. దానికి తాళం వేసి వుంది.

"ఓ వాసిమెన్ను మత్తాను అన్నియో!" అంటూ కేక పెట్టి పిలిచింది.

ఎక్కడో మెయిన్‌గేటు దగ్గర వుండే ఆ వాచ్‌మెన్‌కు ఆమె కేక అందదు. రెండు గేట్లు మధ్య చాలా దూరం.

"ఒరూ పలికిసావటంలేదు!" అని గొణుక్కుంటూ మళ్ళీ అతని దగ్గరకు వచ్చింది.

"ఈ పెంకు లాగేయి అవ్వా!" అని దీనంగా, జాలిగా అర్థించాడు.

ఆ అర్థింపుకు ఆమె బేలగుండె జాలితో కరిగిపోయింది. "అట్టాగేబాబు, అట్టాగే! నీకాడ దస్తీగుడ్డ వుందాబాబూ!" అంది.

అతను యిచ్చిన దస్తీ గుడ్డ తీసుకొని, దానితో ఆ పెంకును వడుపుగా పట్టుకొని, "కూత్తంత వోరుస్కో, బాబూ, సులాగ్గా లాగేత్తాలే!" అంటూ మెల్లగా బయటకి లాగింది.

రక్తం చివ్వున చిమ్మింది. ఆ గుడ్డతోనే అదిమి పెట్టింది. దస్తీ గుడ్డయితే తడచిపోయిందికాని, రక్తం కారడం ఆగలేదు.

ఆమెకు చటుక్కున ఏదో వుపాయం తట్టింది.

"సన్నీళ్ళతో కడిగి తడిగుడ్డ సుట్టితే ఆగుతుందేమో! అట్టా నాలుగడుగులేత్తారేంటి బాబు!" అంది.

అతను తల వూపాడు. ఆమె చెయ్యి ఆసరాగా అందిస్తే మూలుగుతూ మెల్లగా లేచాడు. నీరసంగా "ఆ కుర్రోడు ఏడి వాడికి కూడా దెబ్బలు తగిలాయా?" అన్నాడు. అప్పటికి గాని అతనికి ఆ కుర్రవాడు సంగతి గుర్తుకు రాలేదు.

"ఏ కుర్రోడు బాబు?"

"నా స్కూటరు క్రింద పడ్డ కుర్రోడు-"

ఆమె అటూ ఇటూ చూచింది. "నీ సూటరు కింద కుర్రోడు పడ్డాడా? ఏడి?..... ఈ డోరు కానరాటం లేదే! నేనీడే కూసున్నానే! ఈ దిక్కు అసలు కుర్రోడు వోడూ రాలేదు బాబూ!" అంది.

అతను ఆశ్చర్యంగా, "విచిత్రంగా వుందే! ఒక కుర్రాడు ఇప్పుడు సీసాలు పట్టుకొని రోడ్డుకడ్డంగా పరుగెత్తాడు. అసలు వాడివల్లే ఈ ఏక్సిడెంటు అయింది!" అన్నాడు.

"ఈ దిక్కెవరూ రాలేదుబాబు! నీ కెవన్నా కన్ను చెదిరిందేమో!"

"ఏమోలే పద!" ఆమె నడిపిస్తూంటే ఆమె భుజం మీద ఆనుకొని మెల్లగా అడుగులో అడుగేస్తూ ముక్కుతూ మూల్గుతూ నడిచాడు.

ఆమె అతడ్ని అలా నడిపించి రోడ్డు దాటించి, ఎదురుగా డౌన్లో వున్న గోరీలు వయిపు తీసికెళ్ళింది. గోరీల చుట్టూ పెద్ద పెద్ద చెట్లు, ఆ చెట్ల క్రింద చిన్న చిన్న గుడిశలూ వున్నాయి; వాటికి పెడగా ఒక దరగా వుంది. అతడ్ని ఆ దర్గా మెట్లమీద కూర్చోబెట్టింది. రావిచెట్టు క్రింద వున్న తన గుడిశ వయిపు పెద్ద పెద్ద అంగలేస్తూ వెళ్ళింది. ఒక కడవతో నీళ్ళు తీసుకొచ్చింది. ఆ నీళ్ళతో అతని చేతి గాయాన్ని కడిగింది. రక్తంతో తడిచిన దస్తీ గుడ్డను నీళ్ళలో జాడించింది. ఆ తడిగుడ్డను అతని చేతికి చుట్టింది.

ఎదురుగా వున్న రావిచెట్టు గాలి చల్లగా తాకుతూంటే, చేతికి కట్టిన తడిగుడ్డ మెల్ల మెల్లగా ఆరుతూ వుంటే అతడు సేదదీరాడు; కడగట్టిన అతని ప్రాణం కుదుటపడింది.

ఈ ముసలిదానిలాగే ఆ రావిచెట్టొక పిచ్చిముండ. తను ఎండలో ఎండుతూ తన దరి జేరినవాళ్ళకు చల్లని నీడనిస్తుంది. తను వానలో తడుస్తూ పరులకు 'గొడుగు' పడుతుంది. అందరికీ తలా కాస్త చల్లగాలిని పంచుతుంది. దానికి కల్లా కపటం తెలీదు - కుళ్ళూ కుతంత్రం అంతకన్నా తెలియవు!

ఈ ముసల్దీ, ఆ రావిచెట్టూ ఎలాటి 'ప్రతిఫలం' ఆశించకుండా, ఎందుకింత సేవ చేస్తున్నట్లు. ఏమాశించి ఇలా చేయూతనిస్తున్నట్లు? చెట్లూ చేమలూ సహితం ఇతరులకు చేతనయిన సాయం చేస్తూంటే తన లాంటి ప్రభుత్వ ఉద్యోగులు సేవ చేయడానికే జీతం తీసుకుంటున్న "ప్రజా సేవకులు" - ఇక్కడ ఫైలు తీసి అక్కడ పెట్టాలంటే చేయి తడవందే చేయరు! బిర్యానీలు 'తినిపించి' , బారుల్లో తాపించందే ఒక్క కాగితం 'కదలదు'- ఒక్క పనీ జరగదు! ఈ దేశంలోని లంచగొండులందరు ఈ ముసలిదాన్నీ, ఆ రావిచెట్టునూ చూచి బుద్ధి తెచ్చుకోవాలి అనుకున్నాడు కనకరాజు. పాపం అతనికి ఆ సమయంలో స్మశాన వైరాగ్యం లాంటిదేదో కలిగివుండాలి!

...... ఈ అలికిడికి దరగా అరుగుమీద మునగదీసుకొని పడుకున్న కుంటి తాత దగ్గుతూ, రొప్పుతూ లేచి కూర్చున్నాడు. కనకరాజు వంక కళ్ళు చికిలించి చూశాడు. అయాసపడుతూ "వోరది? లచ్చువమ్మా, ఈ బాబెవరు? ఏటయింది?" అని అడిగాడు.

"ఏటయిందో" లచ్చువమ్మ చెప్పుతుంటె బీడీముక్క కోసం జేబులు తడుముకుంటూ అంతా విన్నాడు.

"అట్టాగా పాపం! మరి అటే దవాఖానాకు తీసికెళ్ళపోయావా లచ్చువమ్మా!" అన్నాడు.

కనకరాజు అప్పుడు, "అవ్వా! ఏదన్నా ఆటో తీసుకొస్తే యింటికెళ్ళిపోతాను. మా యింటి దగ్గర మా డాక్టరున్నాడు." అన్నాడు.

"అట్టగే బాబు! నీవు ఈడే కూకో! సిటికెలో ఆటోబండి తీసికొస్త.... ఓ నరిసిం అన్నియా! కొత్త బాబుగార్ని సూత్తుండు!" అని మళ్ళీ ఆ గోరీల మధ్యనుంచి నడుచుకుంటూ పోయింది.

.....చుట్టుప్రక్కల వున్న చెట్టూ చేమలు మీద నుంచి చల్లగాలి వీస్తుంది. ప్రక్కనే వున్న చింతతోపు వెన్నెలనంతా లాగేసుకుంటున్నట్లుంది - వెన్నెల పలచనయి మసకబారుతుంది. దరగా మెట్ల మీద చెట్ల నీడలు వెలా వెలా బోతున్నాయి. తన ఎలక్ట్రానిక్ వాచీలో టైం రెండుంబావు చూపుతుంది. ఎదురుగావున్న అంబేద్కర్ కాలేజీ ముందున్న బంజరుబయలు (ఓపెన్ గ్రౌండ్) ఆ గుడిశల మధ్యనుంచీ, ఆ చెట్ల చాటునుంచీ అలలు లేని సముద్రంలాగా కనిపిస్తోంది. దాన్ని చూస్తుంటే కనకరాజుకి నాలుగు నెలలక్రితం ఆ గ్రౌండ్‌లో జరిగిన ఒక సంఘటన గుర్తుకు రాసాగింది....

ఆ రోజుకూడా చంద్రుడు ఇలాగే మత్తుమత్తుగా వున్నాడు. చుక్కలన్నీ ఇలాగే కళ్ళు విప్పుకు చూస్తోన్నాయి. ఆ రోజు కూడా తనకు ఇలాగే ఎవరో పార్టీ తగిలాడు. బార్‌కు తీసికెళ్ళితే ఖర్చు "మందు"లో తడిచిమోపెడు అవుతుందని వెధవ భయపడ్డాడో ఏమో, "గురువుగారు! ఈసారి 'వెను' మారుద్దాం!" అని ఈ గ్రౌండ్‌కు కొట్టుకొచ్చాడు.

తనెప్పుడూ చూళ్లేదుగాని, ఈ వోపెన్‌గ్రౌండ్ వోపెనేయిర్ బార్‌లాగా బాగానే వుంది! వెన్నెల ఈ మైదానంలో ఒక సరస్సు అయితే, ఆ సరస్సులో తేలే తెప్పల్లాగా, అక్కడక్కడ ఈ మందు పార్టీ 'సిట్టింగులు' కనిపిస్తోన్నాయి.

ఇది సరదాగా బాగుందే అనిపించింది తనకు!

ఆ 'పార్టీ' గాడు స్కూటర్ 'కిట్'లోంచి నాల్గు బీర్ బోటిల్స్, బయటికి తీసిన క్రింద పెట్టుతూంటే, 'బీరా' అని తను చప్పరించేశాడు.

"అమ్మమ్మ - మీరలా చప్పరించేయమాకండి గురువుగారూ! ఇది బీరే. మైల్డు డ్రింకే - కాదనను! కాన్ని దీన్ని వైల్డుడ్రింక్‌గా మార్చటానికి మన దగ్గర చిట్కాలున్నాయి సార్ చిట్కాలూ!" అంటూ జేబులోంచి భద్రంగా ఏదో పొట్లాం తీశాడు. అందులోంచి ఏదో పొడి చిటికెడు, చిటికెడు తీసి ఆ బీరు సీసాల్లో వేసి, బాగా 'షేక్' చేశాడు.

"ఇక పట్టించండి సార్! ఎంత వైల్డుగా వుంటుందో చూడండి! నా మాట 'బీరు' పోదు!" అన్నాడు.

నిజంగానే వాడి మాట 'బీరు' పోలేదు. దాన్ని త్రాగడం 'వైల్డు హార్స్' మీద స్వారీ లాగే వుంది! ఎత్తెత్తి కుదేస్తోంది- ఎడాపెడా తన్నేస్తోంది - వెనక్కాళ్ళమీద లేపేస్తోంది....

......"చిల్లీ చికెన్" నంజుడుతో మూడున్నర బాటిల్స్ ఖాళీ చేసేసరికి, మూరన్నర పైకిలేపి, కూర్చోబెట్టింది! నిషా నిషా.... అణువణువునా నిషా! నరనరాన నిషా! నిషా-నిషా!

"ఓహో, యమ 'మజా'గా వుంది! నిజంగా, అబ్బ ఇదేదో గొప్ప చిట్కానేనండి "గోపాయి" గారూ! అని వాడ్ని మెచ్చుకుంటూ, తను 'కింగ్‌సైజ్ సిగరెట్టు ముట్టించి గుమ్ముగా దమ్ము లాగుతున్న గొప్ప

'నిషా' సమయంలో, నిశీసుందరి 'నిషా' ఆలాపనలో - అపశ్రుతిలాగా తన వెనుక నుంచి ఒక దీనాలాపన వినిపించింది.

"సార్, ఆ ఖాళీ సీసాలు యిప్పించండి సార్!"

ఒక కుర్రవెధవ వేడుకోలు!

"ఎందుకురా నీకివి? ఏం చేసుకుంటావ్!"

"ఖాళీ సీసాలు అమ్మితే డబ్బులొస్తాయి సార్!"

ఇంతలో మరో కుర్రకుంక వచ్చాడు.

"వాట్ని నాకివ్వండి సార్!" అని బ్రతిమాలసాగాడు.

"ముందు నేనే అడిగా - నాకే ఇవ్వండిసార్!" మొదట వాడు దీనంగా అర్థించాడు.

ఓహో, వీళ్ళల్లో వీళ్ళకు పోటీ!

తనకు బలే సరదా అనిపించింది. వీళ్ళిద్దర్ని "మజా" పట్టించాలనిపించింది. తన 'నిషా' బుర్రకు 'తమాషా' అయిన ఒక ఆలోచన వచ్చింది.

నాల్గో బోటిల్‌లో మిగిలిపోయిన బీరును క్రింద పోశాడు. ఆ మేరకు నేల తడిచింది. (నీళ్ళు పోసిగా పాలు పోసినా, ఆఖరికి త్రాగుబోతులు బీరు పోసినా నేల తల్లి గుండెలు 'తడే' అవుతాయి. మెత్తబడుతాయి తను వదుగొదుగవుతూ మనకేదో ఇవ్వాలని ఆ తల్లి ఆరాటపడుతుంది!) ఒక ఖాళీ సీసా మూతి పట్టుకొని ప్రక్కనున్న రాయిమీద కొట్టాడు. అది సగానికి పగిలింది. సీసా మూతిని అతడే నేలలోకి దిగేశాడు. సగం సగం పగిలిన సీసా కొనలు పై వయిపుకు వున్నాయి.

తనిలా చేస్తోంటే ఆ కుర్రెధవలు ఏదో చోద్యాన్ని చూస్తోన్నట్లు కళ్ళప్పగించి నోళ్ళు తెరచుకొని చూస్తూండిపోయారు.

తను వాళ్ళ వంక గర్వంగా చూస్తూ, "ఇహ ఇప్పుడు మీలో మీకు పోటీ!" అన్నాడు.

వాళ్లు ఒకరి మొగం ఒకళ్లు చూచుకున్నారు.

"మీలో ఎవరయితే ఈ సీసాపను ఆరచేత్తో కొట్టుతారో వాళ్ళకీ మూడు సీసాలను ఫ్రీగా యిచ్చేస్తాను!" అన్నాడు తను.

తనేం అంటున్నాడో మొదట అర్థంకాక ఆ కుర్రవెధవలిద్దరూ బిత్తరపోయి చూశారు. అర్థం అయ్యాక తననొక మాయల మాంత్రికుడ్నో, పచ్చి నెత్తురు త్రాగే నర హంతకుడ్నో చూస్తోన్నట్లు బితుకు గుండెలతో భయం భయంగా చూడసాగారు.

రెండో కుర్రాడు భయంగా "రారా రంగా! పోదాం!" అని చెయ్యి పట్టుకొని లాగాడు. కాని, ఆ రంగడు మాత్రం కదలలేదు! ఇదేదో గొడవగా వుంది అనుకున్నాడో ఏమో ఆ రెండో వెధవ అక్కడ్నుంచి మెల్లగా జారుకున్నాడు. ఆ రంగడు మాత్రం మిగిలిపోయాడు.

"సీసాలు ఇప్పించండి సార్!" అంటూ మళ్ళీ దీనంగా అర్థించాడు.

"చెప్పాగా, దీన్ని నీ అరచేత్తో గుద్దాలి!" అప్పుడు ఆ మూడు సీసాలు ఇస్తాను...... దిస్ ఈజ్ ఎ

గేమ్ - ఎ బెట్!''అన్నాడు తను మత్తు మత్తుగా, గమ్మత్తుగా ఫీలవుతూ.

"మా అమ్మకు జ్వరంగా వుంది సార్!'' నిన్నటేళ్ళుంచీ 'ఛాయి' కూడా త్రాగలేదు, ఆ సీసాలివ్వండి సార్! వాట్ని అమ్మితే బారణా డబ్బులొస్తాయి. వాటిలో మా అమ్మకు జొరంబిల్ల కొంటాను, 'ఛాయి' బన్ను రొట్టె తీసుకెళ్ళుతాను! మీకు పున్నెముంటుంది. ఇవ్వండి సార్!'' దీనాతిదీనంగా బ్రతిమాలాడు.

వాడెన్ని రకాలుగా వేడుకున్నా, జాలిగా అర్థించినా తన మనస్సు మాత్రం కరగలేదు. ఆ సీసాలను వుత్త పున్నేనికి ఇవ్వటానికి వప్పుకోలేదు. లాభం లేనిదే, ప్రతిఫలం ముట్టనిదే తనేపనీ చెయ్యడు, అది తన పోలసీ! తను పట్టిన వ్రతం! తను బూనిని 'దీక్ష'! ఈ మాత్రపు మానసికానందమైనా పొందకుండా ఆ సీసాలను వుచ్చితార్థంగా యిస్తాడా? అది తన పోలసీకి విరుద్ధం - తన వ్రత భంగం.

తనను ఏదో ఒకవిధంగా సంతోషపరచి, తన పని చేసుకోవడమే 'పని'గా పెట్టుకున్న ఆ పార్టీగాడు తనకు వంత పలికాడు. ఆ రంగడిని, "ఏరా మీ అమ్మకోసం ఈ మాత్రంచెయ్యలేవురా?'' అన్నాడు. వాడి మాతృ ప్రేమకే పరీక్ష పెట్టాడు!

ఆ మాటకు రంగడికి పౌరుషమే వచ్చిందో, తల్లి మీద తన బుల్లి గుండెల్లో ప్రేమే పొంగిందో - ఒక నిర్ణయానికి వచ్చినట్లు రోషంగా, "సరే సార్'' మీరు చెప్పినట్లే కొట్టుతాను! మరి ఆ ఖాళీ సీసాలు మూడు ఇస్తారా!'' అన్నాడు కండిషన్‌గా.

"అన్నమాట తప్పుట మా యింటా వంటా లేదురా కుర్రకుంకా!'' అన్నాడు తను.

రంగడు పాతేసిన ఆ సీసా ముందు ముంగాళ్ళ మీద కూర్చున్నాడు.

వాడు అప్పుడు బలిపీఠం ముందు నిలబెట్టబడిన మేకపిల్ల లాగా వున్నాడు. ఆ సీసా కొనలు కోసుగా, భూమిలోంచి పైకి చొచ్చుకొచ్చిన రక్కసి కోరల్లాగా, పిడిబాకుల్లాగా వున్నాయి! ఆ సీసా అమానుష్యానికి మారు రూపంగా, దుర్మార్గత్వానికి మారుపేరుగా, మృత్యు దేవత ఆకలితో చాచిన నాలికల్లాగా వుంది!

వెన్నెట్లో తెల్ల తామర పువ్వులాగా వున్న అరచేయి ఆ రక్కసి కోరల సీసాని, ఆ కోసు కొనల సీసాని, ఆ విష నాలికల సీసాని అదిమింది..... మరు క్షణంలో అది ఎర్ర తామరపువ్వే అయింది! అందులోంచి వేడివేడి రక్తం, లేత లేత రక్తం, దిక్కూ మొక్కూ లేని బీద రక్తం బొట బొటమంటూ బొట్లు కారుతుంది....

క్రింద పడ్డ ఆ రక్తపు చుక్కల వంక కనకరాజు ఒక 'క్రూడ్ థ్రిల్'తో చూస్తోంటే, మాంసం ముద్దలాగా అయిన చేతిని ఏం చెయ్యాలో తోచక రంగడు అల్లల్లాడిపోయాడు. రక్తం ఆగకుండా కారుతూనే వుంది. దాని కడ్డుకట్టాలని క్రింద మట్టి ఇంత తీసి చేతిమీద పోసుకున్నాడు. చొక్కా విప్పి మెలిపెట్టి చేతికి చుట్టుకున్నాడు. రెండో చేతిని ముందుకు చాపి, "ఇకా సీసాలు ఇవ్వండి సార్!'' అన్నాడు నీరసంగా.

సీసాలు తన సొంతమవగానే నగ్నంగా వున్న రంగడి లేత బోర గర్వంగా విరుచుకుంది!

సీసా మూతుల్లోకి వ్రేళ్ళు పోనిచ్చి ఒక చేత్తో బట్టుకొని చొక్కా చుట్టిన చెయ్యెత్తి సలాం చేసి, "వస్తా సార్!'' అన్నాడు.

"గుడ్, అచ్చారే బచ్చా! సుఖంగా పోయిరా!" అని తను దీవించి పంపాడు.

వుషారుగా పరుగెత్తుకుంటూ ఈ దరగా వయిపు పోయాడు.

సీసాల్లోని బీరే కాదు, ఖాళీ సీసాలు కూడా తనకు ఆనందాన్ని, 'మజా'ని యిచ్చినందుకు ఆ పార్టీ గాడు ఆ రోజెంతో మురిసిపోయాడు; తను తృప్తిగా, నిండుగా నవ్వుకున్నాడు....

ఆనాటి సంఘటన గుర్తుకొచ్చి కనకరాజు ఇప్పుడు గాయమైన తన చేతివంక చూచుకున్నాడు.

వెనక్కి తిరిగి, ఆ కుంటి తాత వంక చూచి, "ఇక్కడ రంగడనే కుఱ్ఱాడున్నాడు నీకు తెలుసా?' అన్నాడు.

ఆరిపోతున్న బీడీని నోటితో వుఫ్ వుఫ్‌మని వూదుతూ, "తెలియకేం బాబు! రంగడు సేకులాంటి కుఱ్రోడు! కాని ఆడు సచ్చిపోయాడు బాబు!" అన్నాడు.

రావిచెట్టుమీద పక్షులన్నీ ఒక్కసారిగా రెక్కలు టపటపలాడించి గోలగోలగా అరవసాగాయి.

కనకరాజు ఆశ్చర్యంగా, "ఏంటి రంగడు చనిపోయాడా?" అన్నాడు.

"ఆడికి సావొచ్చి సావలేదు బాబు! ఆడెవరో బలిసినోడు, దురమారగపోడూ వేడుక్కి ఈడిసేత సీసా పెంకుల్ని గుద్దించాడంట! ఆ సేతికి పుండయి సెటిఫిక్ అయి సచ్చిపోయాడు! కాకపోయినా, ఆ కసాయి నా కొడుకు ఈ పసోడిచేత అట్టాంటి పనా బాబు సేయించేది?"

ఆ 'కసాయి నా కొడుకు' గాడి మీద అసహ్యమంతా ఆరిపోయిన బీడీ మీద చూపిస్తూ, దాన్ని దూరంగా విసిరేసి, "థూ" అంటే తుపుక్కున వుమ్మేశాడు.

గట్టిగా సకిలించి మళ్ళీ, "ఇప్పుడు మిమ్మల్ని తీసుకురాలా లచ్చువమ్మ - ఆడి తల్లే బాబు!" అన్నాడు.

ఆ ప్రశాంత వాతావరణంలోని నిశబ్దాన్ని భంగపరుస్తూ ఏదో లోకల్‌ట్రైను గుండెలు పగిలేటట్లు అరుస్తూ పోయింది.....

కుంటి తాత చెప్తుతూనే వున్నాడు; "....లచ్చువమ్మకు సచ్చినోళ్ళు సావగా మిగిలినోడు ఈడొక్కడే బాబు! ఈడూ దగా సేసి పోయాడు! ఆ దిగులుతో అది కుళ్ళిపోతుంది. రాత్తుళ్ళు ఆసుపత్తిరి గేటు కాడే కూకుంటుంది. రంగడు ఆ ఆసుపత్తిరిలోనే పోయాడు. ఆసుపత్తిర్లో ఏసిన కొడుకు బాగాయి మళ్ళీ బయటి కొత్తాడనుకుంటుందో ఏం పాడో పిచ్చిముండ...."

ఇంతలో లచ్చువమ్మ, "రిచ్చా వచ్చింది బాబు," అంటూ ఆ గోరీల మధ్య నుంచి, తుప్పలు కుప్పలు పోసిన చీకట్లోంచి నడుచుకుంటూ వచ్చింది.

"నా సెయ్యట్టుకొని అలాగ్గా లేవండి బాబు!" అని తన చెయ్యి అందించింది.

కనకరాజు గుండెల్లోంచి తన్నుకుంటూ పైకి ఉబికిన కన్నీటిపొర మధ్య నుండి ఆ లచ్చువమ్మ వంకా, తనకు సాయం చేయటానికి చాచిన ఆమె చేతివంకా చూస్తూండిపోయాడు....

- స్వాతి మాసపత్రిక

★